# రక్షాబంధం

శ్రీమతి చిట్టూరి అన్నపూర్ణాదేవి

"రాధా! రాధా!!" రామం పిలిచాడు.

"ఏమిటండీ హడావిడీ?" అంటూ లోపలినుండి రాధ వచ్చింది.

"అనుపమ ఇంటర్ ఫస్టుక్లాసులో పాసయింది" అంటూ చేతిలో పేపరు ఆమెచేతికి ఇచ్చాడు. రాధ ముఖ పద్మం సంతోషంతో వికసించింది. "మీరు భలేవారండి ముందునాకు చూపెడతా రేమిటి? మీ చెల్లెల్ని పిలిచి చెప్పండి"

"అసలు ప్రోత్సాహమంతా దేవిగారిదేగా? ముందుగా దేవిని ప్రసన్నం చేసికోవద్దూ?" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

"సరేలెండి మీ హాస్యం. ఆ పేప రిలా ఇవ్వండి అనుపమకు చూపెడతాను" అని భర్త చేతిలోని పేపరు తీసికొని ప్రక్కగదిలోకి వెళ్ళింది. అనుపమ ఏదోచాలాధ్యాన్నంతో అల్లుతుంది. "ఏంచేస్తున్నావనుపమా?" అన్న వదిన పిలుపువిని "బాబుకు చలికి పనికివస్తుందని స్వెట్టరు అల్లుతున్నాను వదినా" అంది తల పైకెత్తకుండానే.

"అబ్బా ఎప్పుడూ నీకు అల్లుడిగొడవే. ఇదిగో చూడు ఇవ్వాళ నీ పరిక్షాఫలితాలు వచ్చాయి. నీవు ఫస్టుక్లాసులో పాసయినావు" అంది.

"నిజమేనా వదినా? ఏదీ?" అంటు వదిన దగ్గరకు వచ్చి పేపరు తీసుకొని చూచింది. ఆమె ఆనంద పరవశంలో "అన్నయ్యేడివదినా?" అంది అప్పుడే లోపలకు అడుగు పెట్టిన రామం "ఇదిగో వదిన ప్రక్కనే వున్నానమ్మా! అన్నాడు. రాధ ప్రక్కకు చూచి నవ్వింది.

అనుపమ వంగి వదిన కాళ్ళకు నమస్కరించింది. రాధ "నాకెందుకు మీ అన్నయ్యకు పెట్టమ్మా!" అంది.

"అనుపమకు మాత్రం తెలియదా రాధా? అంతా వదినగారి చలవేనని" అన్నాడు మళ్ళీతమాషాగా. అనుపమ అన్నగారి కాళ్ళకు కూడా నమస్కరించింది. రామం హృదయం ఆనందానుభూతులతోనిండిపోయింది.. కంఠం గద్గద మయింది. చెల్లెలి తలమీద చేయి నిమిరి అవతలకు వెళ్ళిపోయాడు అనుపమ వదినతో అంది "వదినా! మీ ఋణం తీర్చుకోలేను. తల్లిలేక పోయినా తల్లిలాగే చూస్తున్నావు. భారమనుకోకుండా చదువుకూడా చెప్పించావు?"

"అలాఅనకు అనుపమా. భగవంతుడుతిన్నగా చూడక పోబట్టి పదహారేళ్ళు దాటని నీకీ వైధవ్యం రావడం నీవు మాఇంట్లో ఉండవలసిన అవసరం వచ్చింది. లేకపోతే బ్రతిమాలితే మాత్రం వచ్చేదానివా?" అంది పమిట చెరగుతో కళ్ళు తుడుచుకుంటూ.

"భగవంతుడు నన్ను ఆరూపంలో వంచించినా నీలాటి మాతృమూర్తిని ప్రసాదించి నా జీవితానికి ఆనందాన్ని ఇచ్చినాడు.

"ఎన్ని చేసిమాత్రం నీ లోటు తీర్చగలమమ్మా!" అంది మళ్ళీ రాధ. ఇంతలో అటువస్తున్న గోపిని ఎత్తుకుంటూ అంది అనుపమ "నాలోటు వీడే తీరుస్తాడు వదినా" గోపి అనుపమ గడ్డం పట్టుకొని "అత్తా! గుఱ్ఱం మీద ఎక్కించి ఆడించవా?" అన్నాడు.

"అలాగే పద" వదినను చూచి నవ్వుతూ వెళ్ళిపోయింది. రాధ నవ్వుకుంది. గదిలో నుండి వస్తున్న వదిననుచూచి "వదినా!" అంది అనుపమ. "ఏమిటమ్మా!" అందిరాధ. "నీకు కోపం రాదంటే ఒక్కమాట వదినా" అంది. "చెప్పు కోపంరాదులే"

"ఇంతవరకు పడిన కష్టం చాలక మళ్లి ఇంత పెద్ద బాధ నెత్తిన పెట్టుకుంటున్నావెందుకు వదినా?" "అదా?

నేనేం కష్టపడ్డాను అనుపమా! నీవు ప్రయివేటు చెప్పి సంపాదించిన డబ్బు బాంకులో వుందిగా?'' అందిరాధ. అదేమిటొదినా నా సంపాదనెంత! నీవు దానిని ఇంటి క్రింద ఖర్చు చేయకపోవడమేమిటి?" అంది.

"అవునమ్మా పెట్టలేకపోగా ఆడపిల్ల కష్టం తినమంటావా?" "వదినా డాక్టర్‌చదువంటే మాటలుకాదు." అంది మళ్ళీ. "ఏమయినా సరే నీజీవితం ఆనందంగా గడవడమే నాకుకావాలి." అయితే డబ్బంతా నాగురించే ఖర్చుచేస్తే బాబుసంగతేమిటి వదినా?" "వాడిసంగతి నీవు చూస్తావు. అని నవ్వుతూ వెళ్ళిపోయింది. వెళ్ళిపోతున్న వదినను చూచి అనుపమ మనసులో అనుకుంది ''మా వొదిన ఎంత మంచిది!"

★ ★ ★

శరత్‌కుమార్ తెలివైనవిద్యార్థి. అనుపమ సహపాఠకుడు, అత్యంత అందగాడు. మొదట్లోఅనుపమ శవాలను చూచి భయపడిపోయింది. ఆడవాళ్ళందరూ పక పక నవ్వారు. అనుపమ సిగ్గు పడ్డది. అది గమనించిన శరత్ కుమార్ ఆమెను సమీపించి "చూడండీ! కొంచెం ధైర్యంతో పనిచేయండి. కావాలంటే మీకు నేనన్ని విధాలా సహకరిస్తాను. అన్నాడు. అనుపమకు కొండంత ధైర్యం కలిగింది. శరత్‌కుమార్‌కు ధన్యవాదాలర్పించింది.

శరత్‌కుమార్ సహాయంతో మొదటి సంవత్సరం మంచిమార్కులతో విజయం పొందింది అనుపమ. శరత్‌కుమార్ ఉత్సాహంతో చదువుతున్నాడు. అందరూ అతని ఉత్సాహానికి అనేక రకాల అంచనాలు వేశారు.

★ ★ ★

మూడవ సంవత్సరములో అడుగు పెట్టారు. విద్యార్థులు. అది మెడికల్ కొక గడ్డుసమస్య. అందరూ తహ తహ లాడిపోతున్నారు. పఠన మందిరంలో ఇద్దరుముగ్గురుగా కూర్చొని తీవ్రంగా మననం చేస్తున్నారు అనుపమ ఒక్కతే కూర్చుని చదువుతుంది. ఆమె ముఖం మీద ఏవో విషాద రేఖలు కనుపిస్తున్నాయి. ఇంతలో ఆమెకు "అనుపమాదేవి?" అన్న పిలుపు వినబడ్డది. ఆశ్చర్యంతో తలపైకెత్తింది. "మీరెందుకొచ్చారు?" డాక్టరుగారు రెస్టు తీసుకోమన్నారుగా?'' అంది. ప్రక్క సీటులో కూర్చుంటూ "ఇప్పుడు జ్వరం లేదులెండి చదువుకుందామని వచ్చాను, అదీకాక....'' అని వూరుకున్నాడు. "అదీకాక? ఏమిటో చెప్పండి!" అంది అనుపమ.

"మరేంలేదు ఇలా కన్నుమూశాను, మీరు చాలా విచారంగా కూర్చున్నట్లు కనుపించారు. ఇక ఉండలేక వచ్చేను." అనుపమ ఏమీ మాట్లాడలేదు. తల వంచుకుని వూరుకుంది. శరత్‌కుమార్ అలవాటు ప్రకారం చదువుతూ ఆమెకు అక్కడక్కడ ఏదో బోధపరచడం మొదలుపెట్టాడు. గడియారం 11గంటలుకొట్టింది. విద్యార్థులందరు లేచి తమ తమ హాస్టలువైపునకు నడిచారు. హాలు బయటకు వచ్చిన అనుపమ శరత్‌కుమార్‌ని చూచి "శరత్‌బాబూ! మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను." అంది.

"ఋణమేముందండీ, అందరం ఒకచోట ఉన్నప్పుడు ఒకరికొకరు సహాయం చేసికోవడం మానవ కర్తవ్యం మీరుమాత్రం ధైర్యంగా చదవండి. భయంలేదు. తప్పక మంచిమార్కులతో పాసయిపోతారు." అన్నాడు. "నమస్కారం శరత్‌బాబూ!" అంది. "నమస్కారం వెళ్ళిరండి. అంటూ తన హాస్టలువైపుకు నడిచాడు.

★ ★ ★

''అనుపమాదేవీ! రేపు వెళ్ళిపోతున్నాం మన స్వగ్రామాలకు'' అన్నాడు. "అవును మీమేలెన్నటికీ మర్చిపోలేను. ఆనందంతో ఆరు సంవత్సరాలు గడిపి [illegible] సాధించి వెళుతున్నది మీ సహాయంవల్లనే." [illegible] కృతజ్ఞతతో అనుపమ ..

"మీరు విజయం సాధించారుకాని [illegible] "అని వూరుకున్నాడు. ''పూర్తిగా చెప్పండి శరత్‌బాబూ!" అంది.

"ఏమీలేదు కాని మిమ్ము ఒక విషయం అడగాలని చాలాకాలంనుంచివుంది." "అడగండి సందేహిస్తారేం?" అంది.

"అయితే చెప్పండి ప్రతీవారి జీవితాలకూ ఒక జీవిత సాధి అంటూ వుండాలి కదూ?" "తప్పక" అంది అనుపమ.

"అయితే మీరెవరిని మీ జీవితసాధిగా చేసుకున్నారు?"

"నా జీవితానికి సాధిని పెద్దలు చిన్నతనంలోనే ఇచ్చారు."

"అయన ఎక్కడ?" అన్నాడు ఆశ్చర్యంతో.

"స్వర్గంలో" అంది అనుపమ గంభీరంగా.

"అది నాకు ముందే తెలుసు." అన్నాడు శరత్ కుమార్.

"అయితే మీ ప్రశ్నకు అర్థం?'' అంది.

"చదువు సంధ్యలు సంస్కారముగల మీ వంటిస్త్రీలు కూడా ఇలా వెనుక బడి వుండడం....అనివూరుకున్నాడు

"చదువుకున్న సంస్కారులకది లక్షణంకాదు అంటారు అంతేనా?" "అవును'' "శరత్‌బాబూ! చదువు సంస్కారాలు మానవత్వాన్ని కోల్పోయి పశుత్వానికి లోబడడానికేనా?''

"ఇందులో పశుత్వ మేముంది అనుపమాదేవీ?" అన్నాడు.

"పశుత్వమేకాదు, పసితనంకూడా వుంది, ఇదేమనను అసంతృప్తి అనే అగ్నిగుండంలోకి త్రోసివేస్తుందొకరోజు. వివాహ సంబంధం అతిపవిత్రమయిన ఇహపరలోకాలకు సంబంధించిన బంధనం. అది మనఇష్టప్రకారము మార్చుకొనుటకు వీలులేనిదని నా దృఢవిశ్వాసము" అనుపమ మాటలు వింటున్న శరత్‌కుమార్ మొఖముపై ఏవో ఆనందరేఖలు అలుముకున్నవి.

"అనుపమాదేవీ! క్షమించండి, మిమ్ము్మను అర్థంచేసికోకుండా ఏవో అసందర్భపు ప్రశ్నలు వేసినందుకు సిగ్గుపడుతున్నాను!"

"పశ్నలువేయబట్టే నన్నర్థం చేసికున్నారు, ఇందులో సిగ్గుపడవలసిన అవసరంలేదు'' అంది అనుపమ.

"సిగ్గుతోపాటు గర్వంతోకూడిన ఒక ఆనందంకూడా కల్గిగింది అనుపమాదేవి" అన్నాడు.

"ఎందుకో తెలుసుకోవచ్చా శరత్‌బాబూ"

"ఇంకా భారత దేశంలో మీలాంటి సుశిక్షిత స్త్రీలు వున్నారుకదా అని, కానిదానితో పాటు నా హృదయంలో ఒక తుఫాను చెలరేగింది"

"ఏమి తుఫాను శరత్‌బాబూ?"

"ఎవరు ఏమి చెప్పినా ఆ తుఫాను ఆగేదికాదు రేగేదేకాని...."

"అలా అనకండి శరత్‌బాబూ, మీరు నాకెంతో లుమే చేశారు, మీ హృదయశాంతికి నేనేమయినా చేయగల నేమో చెప్పండి." అంది వినయంగా.

"హృదయశాంతి లభించేది కావాలన్నది దొరికినప్పుడేగా అనుపమాదేవీ?"

"అదే, మీకు కావలసిన దేమిటో చెప్పండి" అంది మళ్ళీ.

"అయితే నేను కావాలన్నది మీరివ్వ గలరా?" అన్నాడు ఆమె ముఖంచూచి. ఆమె ముఖంమీద క్షణం సేపు ఆశ్చర్యం గోచరించింది. అదిచూచి

"చూచారా? మరిమీరు ఎంత ఆలోచిస్తున్నారో?' అన్నాడు.

"చెప్పండి శరత్‌బాబూ నా శక్తికొలది ప్రయత్నిస్తాను" అంది సర్దుకుని

అయితే వినండి, నా హృదయంలో మీమాటలు విన్న దగ్గరనుండి మీలాటి చెల్లెలు నాకులేదే అన్న తుఫాను రేగింది. "అనుపమ ముఖపద్మం వికసించింది. ఆమె ఆనందపరవశత్వంలో అంది.

"శరత్‌బాబూ నన్నే మీచెల్లిని అనుకోకూడదా?"

"ఎందుకనుకో కూడదు కాని నీవు నావంటి వాడిని అన్నగా స్వీకరిస్తావా! అన్న భయంతప్ప మరేమిలేదు."

"తప్పకుండాను మీలాటి అన్నను సంపాదించ గలగడం నాపూర్వజన్మ సుకృతంగా తలచుకుంటాను. అంటూ ఆమె తనపెట్టెలోనుంచి ఒక పచ్చదారం తెచ్చి "చెయ్యి ఇలా యివ్వండి అన్నయ్యా!" అంది. శరత్‌కుమార్ మంత్రముగ్ధుడివలె చెయ్యి ముందుకు చాచాడు. ఆమె అతని చేతికి ఆదారంకట్టి ఈ నాటినుండి మీరు నా సహోదరులు అంది. "ఇదేమిటమ్మా?" "ఇది ప్రపంచ విజేత అలగ్జాండరును పురుషోత్తముని బల్లెపుపోటు నుండి తప్పించిన రక్షాబంధం" అంది.

శరత్‌కుమార్ కండ్లనుండి ఆనంద బాష్పాలు జల జల రాలాయి.